క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1 వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం గిరి ప్రదక్షిణ జరిగింది. మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరి స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేటి నుంచి ఆధార్ క్యాంప్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఈ నెల 27 నుంచి జనవరి 6 వరకు ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేశామని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు తెలిపారు. సెక్టార్–1 షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న క్యాంప్‌లో మొబైల్ నెంబర్ లింక్, అడ్రస్ మార్పు, పుట్టిన తేదీ, బయోమెట్రిక్, ఫొటో అప్‌డేషన్, కొత్త ఆధార్ కార్డ్, ఆధార్ కార్డ్ అప్‌డేషన్ చేస్తారని తెలియజేశారు. పరిసర ప్రాంతాల వారు క్యాంప్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

‘గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్’లో ఉక్కు బాలికలు



గిన్నిస్ రికార్డ్స్‌లో పేర్లు నమోదు చేసుకున్న బాలికలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌కు చెందిన శ్రీలయ డాన్స్ అకాడమీ చిన్నారులు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో కూచిపూడి కళావైభవం కార్యక్రమం నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న శ్రీలయ అకాడమీ చిన్నారులు ఛాయా దీప్తి, హారిక, చంద్ర సుమ, విశిష్ట, తేజస్విని, సోహని, లక్ష్మీ ప్రసన్న అద్భుత ప్రతిభ కనబరిచి నృత్యాలు ప్రదర్శించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో తెలంగాణా మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, నటి జ్యోతి రెడ్డి చిన్నారులను అభినందించినట్లు అకాడమీ వ్యవస్థాపకురాలు నరీనా తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం నగరానికి చెందిన ఎస్.శివకుమార్ రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. సింహగిరిపై మే ఐ హెల్ప్ యు కేంద్రంలో సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో పీఆర్వో నాయుడికి అందించారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

బలరాముని అలంకరణలో అప్పన్న



బలరామాలంకారంలో అప్పన్నకు తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి బలరాముని అలంకరణలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని బలరాముడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్టింపజేశారు. ఆళ్వారులను వేరొక పల్లకిలో వేంజేపచేసి, సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు.

ఆరంభం అదిరింది

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు



77వ వార్డులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి



ఆదర్శ్ గ్రౌండ్‌లో క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: ప్రతీ ఒక్కరిలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ‘ఆడుదాం–ఆంధ్రా’ క్రీడల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. వుడా కాలనీ వినాయకనగర్‌లోని ఆదర్శ్ గ్రౌండ్‌లో ఆడుదాం ఆంధ్రా కీడా పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. గ్రామీణ స్థాయి నుంచి యువతలో క్రీడాస్ఫూర్తిని నింపి, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. క్రీడాకారులంతా క్రమశిక్షణతో పోటీల్లో పాల్గొని గాజువాక నియోజకవర్గానికి, తద్వారా రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో నిర్వహించనున్న ఈ పోటీలు వచ్చే నెల 9 వరకు జరుగుతాయన్నారు. నియోజకవర్గం పరిధిలో అన్ని క్రీడల్లో కలిపి, మొత్తం 87 టీములు పోటీ పడ్డాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు(చందు), మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, జోన్–6 జోనల్ కమిషనర్ పి. సింహాచలం, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నరసింహపాత్రుడు, భూపతిరాజు సుజాత, జిల్లా ప్రధాన కార్యదర్శులు కోమటి శ్రీనివాసరావు, రోజారాణి, మాజీ డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, మండల అధ్యక్షుడు రాజాన వెంకటరావు, ఎండీ గౌస్, బొడ్డ గోవింద్, నాయకులు మార్టుపూడి పరదేశి, మంత్రి శంకరనారాయణ, ప్రమీల, సంపంగి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

64వ వార్డులో..

జీవీఎంసీ 64వ వార్డు గంగవరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్రా పోటీలను జోనల్ కమిషనర్ పి.సింహాచలం ప్రారంభించారు. ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని, క్రీడల్లో రాణించాలని సూచించారు.

75వ వార్డులో..

జీవీఎంసీ 75వ వార్డు నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్రా పోటీలను జీవీఎంసీ జోన్–6 జోనల్ కమిషనర్ పి.సింహాచలం ప్రారంభించారు.

77వ వార్డులో..

జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని నమ్మిదొడ్డి జంక్షన్‌లో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర పోటీలను కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఉరుకూటి చందు



68వ వార్డులో కబడ్డీ జట్లతో పోటీల నిర్వాహకులు

68వ వార్డులో..

అక్కిరెడ్డిపాలెం: ఆడుదాం ఆంధ్రా పోటీలు ఆటోనగర్ సెయింట్ అలాయిషస్ ఐటీఐలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 68వ వార్డు పెద్ద అక్కిరెడ్డిపాలెం సచివాలయ పరిధిలో కబడ్డీ పోటీలను ఇక్కడ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు వరదాడ వెంకటరమణకు అడ్మిన్ సెక్రటరీ, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ ఉన్నీసా బేగం మొక్కను అందజేశారు. అనంతరం పెదఅక్కిరెడ్డిపాలెం నుంచి విచ్చేసిన రెండు కబడ్డీ జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వార్డు ప్రత్యేక అధికారి మణికుమార్, ఫిజికల్ డైరెక్టర్ పీవీ రత్నం, సచివాలయ సిబ్బంది శాంతి రాజు లంక, ఇస్రా పేమ్‌కుమార్, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వంగవీటికి ఘన నివాళి



రంగా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కృష్ణదేవరాయ సేవా సంఘం ప్రతినిధులు

అగనంపూడి: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన వంగవీటి మోహనరంగా రాష్ట్ర ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని కృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం గాజువాక అధ్యక్ష, కార్యదర్శులు జెర్రిపోతుల ముత్యాలు, తలారి వెంకటరమణ అన్నారు. రంగా వర్ధంతి సందర్భంగా అగనంపూడి హనుమాన్ కూడలిలో నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. రంగా మృతి పేదలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో ముమ్మన అప్పారావు, గంతకోరు అప్పారావు, దుల్ల చెల్లారావు, గళ్ల సూర్యనారాయణ, కనకరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

- పెదమడక వంగవీటి రంగా, రాధా మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మిత్ర మండలి ప్రతినిధులు ఎం.వి.రమణ, బి.సత్యనారాయణ, వి.నారాయణరావు, ఎం.శ్రీనివాసరావు, కె.నరసింగరావు పాల్గొన్నారు.

యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: గ్రామీణ స్థాయి నుంచి యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా ‘ఆడుదాం ఆంధ్రా’ కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎన్నార్ ఫంక్షన్ హాల్లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువ క్రీడాకారులు ఎంతగానో ఇష్టపడే క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి ఐదు క్రీడలను గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు), మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గురు దత్త జయంతి వేడుకలు



దత్త జయంతి వేడుకల్లో నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

అగనంపూడి: గురు దత్త జయంతిని అగనంపూడి షిర్డీసాయి మందిరంలో మంగళవారం కనులపండువగా జరిపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ జి.పూర్ణానందశర్మ (పూర్ణ) పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దత్తాత్రేయుడిని పూజిస్తే త్రిమూర్తులను పూజించిన పుణ్యం కలుగుతుందన్నారు. పరిసర ప్రాంతాల భక్తులు పూజల్లో పాల్గొన్నారు. కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం వారికి జ్ఞాపికలు బహూకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ కె.వి.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.వ్యాసశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, పి.రమ్య లక్ష్మి, పి.రామారావు, శంభుడు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు సరకుల పంపిణీ



మృతుల కుటుంబాలకు నిత్యావసరాల సరకులు అందజేస్తున్న పేర్ల అప్పారావు

పెదగంట్యాడ: మృతుల కుటుంబాలకు కల్చర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పేర్ల అప్పారావు సాయం అందించారు. గత నెల 9న జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగవరం ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు మరణించడంతో ఆ కుటుంబాలను మంగళవారం ఆయన పరామర్శించారు. హైదరాబాద్‌కు చెందిన హజారి ప్రవీణ్, సింగపూర్‌లో ఉంటున్న వారా చైతన్య, కల్చర్ ఫౌండేషన్ అధ్యక్షుడు పేర్ల అప్పారావు ఆర్థిక సాయంతో మృతుల కుటుంబాలకు నిత్యావసర సరకులను అందజేశారు. అలాగే గంగవరం గ్రామానికి చెందిన స్మార్ట్ గైస్ సంఘం ఒక్కో కుటుంబానికి రూ.1000 వంతున ఆర్థిక సాయం అందించింది.

1048వ రోజుకు ‘ఉక్కు’ దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ పరిశ్రమలను కాపాడుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1048వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో స్టీల్‌ప్లాంట్ టీపీపీ, పీఈఎం, ఆర్‌ఈడీ, స్టోర్స్ విభాగ కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నేడు దేశంలో ప్రజాసమస్యలను వదిలి తమ రాజకీయ అవసరాల కోసమే పాలక, ప్రతిపక్ష పార్టీలు కుట్ర రాజకీయాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. ఉక్కు ఉద్యమాన్ని ప్రజా పోరాటంగా మలచి పాలకులు స్పందించే విధంగా కార్మికులు పోరాడాలన్నారు. శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

‘ఉక్కు’ పరిరక్షణకు ఐక్యంగానే పోరాటం

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీని విచ్ఛిన్నం చేయాలని జరుగుతున్న చర్యలకు తాము మద్దతు ఇవ్వడం లేదని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం, స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన సంయుక్త సమావేశంలో వారు ఈ మేరకు ప్రకటించారు. ఇటీవల కొన్ని కార్మిక సంఘాలు అఖిలపక్ష కార్మిక సంఘాల పేరుతో కరపత్రాలు ముద్రించి తమ అనుమతి లేకుండా తమ సంఘాల పేర్లను చేర్చారన్నారు. అన్ని యూనియన్లు, అసోసియేషన్లు ఐక్యంగా ఉండటం వల్లే 1047 రోజులుగా పోరాటం సాగుతుందన్నారు. ఐక్యంగా పోరాటం చేయడం ద్వారానే ప్రైవేటీకరణను అడ్డుకోవాలని భావిస్తున్నామన్నారు. తమ సంఘాలను వేరే విధంగా వినియోగిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘం ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సత్యనారాయణ, డి.పుల్లారావు, ఎస్.మోహన్‌బాబు, ఓబీసీ సంఘం అధ్యక్షులు బి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి నష్ట పరిహారం



క్షతగాత్రుడికి నష్ట పరిహారం అందిస్తున్న యాజమాన్యం

అగనంపూడి: ఇటీవల అగనంపూడి కూడలిలో బస్సు ప్రమాదంలో గాయపడిన ఎం.రాజు కుటుంబానికి బస్సు యాజమాన్యం నష్ట పరిహారం చెల్లించింది. రాజును బస్సు ఢీకొనడంతో కాలు ఫ్రాక్చర్ అయింది. దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఫార్మాసిటీ నిర్వాసిత సంఘం నాయకుడు కర్రి దోశేంద్ర బస్సు యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లడంతో రూ.50 వేల నగదు అందించారు. అలాగే.. ఇటీవల గుండెపోటుతో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న తలారి శ్రీను కుటుంబానికి నెలకు సరిపడా రేషన్ సరుకులను దోశేంద్ర అందించారు. కార్యక్రమంలో ఎం.వెంకటరావు, ఇ.పోలినాయుడు, ఎస్.బాబ్జి, యు.రామునాయుడు, పి.వెంకటరమణ, ఇ.కన్నారావు పాల్గొన్నారు.

ముగిసిన కార్తీక మండలకాల నిత్యాన్నదానం



మాలధారులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న స్వామి అయ్యప్ప సేవా సంఘం ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయంలో కార్తీక మండలకాలం నిత్యాన్న సమారాధన మంగళవారంతో ముగిసింది. అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 14 నుంచి డిసెంబర్ 26వ తేదీ వరకు నిర్విఘ్నంగా సాగిన నిత్యాన్న సమారాధనకు ఆర్థిక సహకారం అందించిన దాతలను ఈ సందర్భంగా సత్కరించారు. సేవా సంఘం అధ్యక్షుడు అదపాక వెంకటరమణ మాట్లాడుతూ ఈ మండల కాల అన్న సమారాధనలో మణికంఠ జ్యోతి భక్త సేవా సంఘం 6 బుధవారాలు, అయ్యప్ప ఆలయ కమిటీ 6 శనివారాలు అన్నదానం ఏర్పాటు చేయడంతో మిగిలిన 30 రోజుల పాటు శ్రీ స్వామి అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్న సమారాధన నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్.రవికుమార్, బి.అప్పలనాయుడు, సీహెచ్.మురళీశ్వరరావు, సమటాపు అప్పలనాయుడు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి అంగన్‌వాడీ కార్యకర్తల వినతి



మంత్రి అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అక్కిరెడ్డిపాలెం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంత్రి అమర్‌నాథ్‌కు అంగన్‌వాడీ కార్యకర్తలు వినతిపత్రం అందించారు. అక్కిరెడ్డిపాలెం, గాజువాక, అగనంపూడి, ఇస్లాంపేట, పెదగంట్యాడ సెంటర్లకు చెందిన 125 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు మంత్రిని మిందిలోని ఆయన నివాసంలో కలిశారు. 11 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కమ్యూనిస్టు నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సరైన వేతనాలు ఉండేవి కావని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే వారికి మెరుగైన వేతనాలు, ప్రత్యేక సదుపాయాలు కల్పించారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి అందరికీ మంచే చేస్తారన్నారు.

ఆటో బోల్తా: ఐదుగురికి గాయాలు



బోల్తా పడిన ఆటో

పెదగంట్యాడ: మండలంలోని యారాడ గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. న్యూపోర్టు ట్రాఫిక్ ఎస్‌ఐ పెద్దాడ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బంగా రాష్ట్రం కోల్‌కతాకు చెందిన రెండు కుటుంబాలకు చెందినవారు విశాఖ పర్యటనకు వచ్చారు. విశాఖ సాగరతీరంలో సరదాగా గడిపిన వారంతా ఓ ఆటోలో యారాడ తీరానికి బయల్దేరారు. యారాడ గ్రామానికి సమీపంలో ఆర్చ్ వద్ద ఆటో అదుపుతప్పింది. దీంతో ఆటోలో ఉన్న ఆరుగురితో పాటు ఆటో డ్రైవర్ రోడ్డుపై పడిపోయారు. ఆటో డ్రైవర్ రాము తలకు గాయం కాగా ఆటోలో ఉన్న ఆరుగురిలో ఇద్దరి కాళ్లు విరిగిపోగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఇందులో దేబాసిస్ దాస్ (44) ఎడమ కాలు విరిగిపోగా, అరుణవా సాహ (38)కు కుడికాలు విరిగిపోయాయి. న్యూపోర్టు ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. న్యూపోర్టు ఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదిరిన ఆహ్వాన్ ఫెస్ట్

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

దాబాగార్డెన్స్: విద్యార్థుల కేరింతలతో ఏవీఎన్ కళాశాల ప్రాంగణం దద్దరిల్లింది. కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ‘ఆహ్వాన్ ఫెస్ట్’ మంగళవారం ప్రారంభమైంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పలు కార్యక్రమాలు నిర్వహించగా.. మధ్యాహ్నం నుంచి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సినీతార అవికాగోర్, నటులు బుల్లెట్ భాస్కర్, ఐనవోలు ప్రసన్నకుమార్ పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. చదువుకుంటేనే భవిష్యత్ అంటూ హితవు పలికారు. ఫెస్ట్‌లో భాగంగా డ్యాన్స్, మ్యాజిక్, సింగింగ్, స్కిట్, స్టాండప్ కామెడీ, డైలాగ్ వార్స్, ర్యాంప్ వాక్‌తో విద్యార్థులు అదరగొట్టారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కళాశాలలో చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు అందుకున్నారని.. అందుకు ఎంతో గర్విస్తున్నానన్నారు. వారందరి స్ఫూర్తితో విద్యార్థులు మరింతగా చదివి ఇటు కళాశాలకు..అటు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు మాట్లాడుతూ నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులు ఫెస్ట్‌లో పాల్గొన్నారని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, డీన్ డాక్టర్ జి శంకరనారాయణ, మీడియా కో ఆర్డినేటర్ పైడి రజని తదితరులు పాల్గొన్నారు.



సందడి చేసిన సినీ నటి అవికాగోర్

సుందరంగా థీమ్ పార్కుల అభివృద్ధి



షిప్‌యార్డు లే అవుట్‌లోని యోగా థీమ్ పార్కు పరిశీలిస్తున్న నగర కమిషనర్ సాయికాంత్ వర్మ

పీఎం పాలెం : ఆధునిక సమాజానికి అనుగుణంగా ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా థీమ్ పార్కులు తీర్చిదిద్దుతున్నామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అన్నారు. జీవీఎంసీ 6, 8 వార్డుల పరిధిలో నిర్మాణంలో ఉన్న థీమ్ పార్కులను మంగళవారం ఆయన పరిశీలించారు. పీఎం పాలెం షిప్ యార్డు లే అవుట్‌లో నిర్మిస్తున్న యోగా థీమ్ పార్కును, బక్కన్నపాలెం బుచ్చిరాజు లే అవుట్‌లోని స్పోర్ట్స్ థీమ్ పార్కును, ఎమ్మెస్సార్ లే అవుట్‌లోని ల్యాండ్ స్కేప్ థీమ్ పార్కును, వైఎల్‌పీ లే అవుట్ ఫామ్ గార్డెన్ పార్కును పరిశీలించారు. యోగా థీమ్ పార్కును పచ్చని మొక్కలతో నింపాలని, స్పోర్ట్స్ థీమ్ పార్కులో వాలీబాల్, షటిల్, క్రికెట్ నెట్ ప్రాక్టీస్ ఏరియాలో గ్రీనరీ కోసం ఆకర్షణీయమైన మొక్కలు 15 రోజుల్లో నాటాలని ఆదేశించారు. అనంతరం కొమ్మాది జంక్షన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. లా కాలేజీ జంక్షన్ ప్రమాదకరంగా ఉన్నందున వీ కన్వెన్షన్ ఎదురుగా స్థలం సూచిస్తూ జంక్షన్ తరలించడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జెడ్సీ కనక మహాలక్ష్మిని ఆదేశించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టీ కల్చరల్ ఎం.దామోదర రావు, పర్యవేక్షక ఇంజినీర్ శాంసన్ రాజు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం



యజ్ఞోపవీత ధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.